

''దేవేంద్రా!

దేవేంద్రుడూ!.... డూడూ....డూ!" ఆగంతకుడు అరుస్తున్నాడు, కాస్సేపటికి కొండచిలువలాగ సింహాసనం మీద పడిఉన్న ఇంద్రుడు మెల్లిగా కదుల్తూ ".... ఎవరక్కడ?" అంటూ మత్తుగా నసిగాడు.

"ఓహో! రెప్పవెయ్యకుండానే మత్తు నిద్ర చిత్తగిస్తున్నావన్నమాట అనిమిషాధిపా! నీ బానకడుపు నిండుగా సురాపానం చిత్తుగా పట్టించావు లాగుంది, నేను తప్ప మరెవరూ లేరు!" అన్నాడు ఆగంతకుడు.

"ఎవర్నువ్వు?"

"ఎన్నిసార్లని చెప్పడం.... ఎక్స్ భూలోకీయుణ్ణి, మాజీమంత్రి ముఖ్యుణ్ణి! మాజీ అమాత్య కేంద్రీయుణ్ణి! మాజీ ........" అన్నాడాగంత.

"తెలిసిందిలే! స్వర్గధామం చేరినవాడివి స్వర్గసుఖాలు సురభోగాలు అనుభవిస్తూ ఉండక స్వర్గచెర తప్పించమనీ, నరకానికి బదిలీకావాలని పదేపదే గోల చేసెదవేల?"

"నరకంలో నాకు ఆడామగా ఆప్తవర్గం దొరుకుద్ది, ఓపెన్నెర్ థియేటర్ లాంటి నీ బోడి ఇంద్రలోకం— బురద కోటసంత బయలుపాటి చెయ్యని ఈ స్వర్గధామం, ఉసూరుమనిపిస్తున్న యీ సురభోగాలు బోరుకొట్టి చిత్రహింస చేస్తున్నాయని ఎంతని మొర పెట్టాలి? మీ సుర మా నీరా కంటె అద్వాన్నం! అప్పసరసల మేజువాణీ కాబరే ముందు దిగదుడుపు! కామధేనువు కాఫీ యివ్వదు. కల్పవృక్షం విస్కీబుడ్లు కాయదు, అమృతం కూడా డొక్కు టీపాటి చేస్తుందో లేదో? ఈ చచ్చుస్వర్గం నుంచి



త్రిశంకుణ్ణి తోసేసినట్లు తోసేయి!.... ....” ఆగంతకుడు అనర్గళంగా వాగుతున్నాడు.

“ఔరా! ఎంతలేసి మాటలు విసిర్తివిరా డింగరీ!” అన్నాడింద్రుడు.

“డింగరీ మాట వాడే అర్హత నీకులేదింద్రుడూ! ఆ పింగళి నాగేంద్రుడికే చెల్లు! నీ నోరు తిరగదు, ఆ రంగారావే అనాలి!.... ఇదిగో.... ఇంద్రుడూ నీకు గిడిగిడిగిడి! అంతే!” అంటూ పకపకమన్నాడాగంత.

“ఏమే రంభా! ఓ ఊర్వశీ! మేనకా! తిలోత్తమా!.... మీరంతా ఎక్కడ చచ్చారు??!” అంటూ ఇంద్రుడు పెట్టిన కేకకు రంభ, ఊర్వశి ఊడిపడ్డారు.

“ఈ మాజీ గోలపెట్టి చంపుతున్నాడు, కాస్త బాగా నాట్యంచేసి చూపండర్రా!” అన్నా డింద్రుడు.

“ఈ దేబెల్ని ఎందుకు రప్పించావయ్యా ఇంద్రా!? వీళ్ల పేడముఖాలు చూసి చిర్రెత్తిపోతూంటే....” అన్నాడు ఆగంతకుడు.

ముఖాలు మాడ్చుకొని రంభా ఊర్వశీలు మూతి మూడు వంకర్లు తిప్పుతూ మెటికలు విరిచి ఒకరితో ఒకరు “హలా! హలా! ఎలా కూశాడో, వీడి జిమ్మడిపోను, వీడి పెళ్లాం ముండమొయ్య!” అంటూ మెల్లిగా అంటూంటే ఆగంత

కుడు నవ్వి "హలా అని పిల్చుకున్నారు బాగుంది! అదీ మా పింగళివారిదే. మీ తిట్లు మాత్రం బురదకోట అమ్మలక్కలవే! స్వర్గంలో కూడా బండ తిట్లేనా? మీ దేవసానుల వేషాలేసి మీ అప్సరసల పరువు భూమ్మీద కాపాడుతూన్న మా సినిమా నాట్యతారలు కట్టిడిసిన బట్టలు తాకినా వాళ్ల ఋణం తీర్చుకోలేరు— ఆ మేనకా తిలో త్తమలేరీ?" అన్నాడాగంత.

"ఏం— వాళ్లంటే ఎందుకంత అభి మానం?" అడిగింది రంభ ఉక్రోషంగా.

"మేనక శకుంతల్ని కన్నందుకు, తిలో త్తమ సుందోపసుందుల్ని కాట్లా డించి, వాళ్ల కొట్టుకు చచ్చినందుకు!" జవాబిచ్చాడు అగంత తకీమని.

"హలా! యింకా యిక్కడుంటే మన మర్యాద దక్కదు పదవే పోదాం హలా!" అంటూ ఊర్వశీరంభలు అలో అలోమని ఉడాయించారు.

"నా ముందే నావాళ్లను అవమా నిస్తావ్రటా సాహసీ!" కోపం వొచ్చి ఇంద్రుడన్నాడు.

"పాపం కోపమొచ్చిందా! నీ సాన వ్వాలు ఇందాకా ముండమొయ్యా అని తిట్టారేగాని నా అసలు పెళ్లం అనగా ధర్మపత్ని ముండమోసింది గనకనే గదా యిక్కడ తగలడే దౌర్భాగ్యం నీలాంటోడిచేత రా అనిపించుకోవల్సి వచ్చింది!.... చతురం నా చతురం యిక్కడకు వచ్చే అవకాశం లేదుగాని, వస్తే పూతికల చీపురుతో అచ్చరల బూజూ నీ బూజూ దులిపేసేది!" అన్నాడు అగంత.

"అంతటి సౌందర్యమా ఆ సుందరీ మణిది?" నోరు చప్పరిస్తూ అన్నాడు ఇంద్రుడు.

"సౌందర్యం చచ్చుబండాను, ఒకటో రకం సెక్స్ సింబల్! మా ప్రాంతందే, విదేశాలపాలై, బ్లూఫిల్ముల్లోపడి నలిగి పోతూన్నదాన్ని నా విదేశీ పర్యటనలో చూసి ఆశపెట్టి లాక్కొచ్చా! సంక్షేమ మంత్రిణిగా చెయ్యమని శతపోరింది గాని చివరికి నిరాశతో నీసాడు నిద్రమాత్రలు మింగింది. నా ప్రియ చతురం— అంటే నా ప్రియతమ నాలుగో అభిమాన కళత్రం — ఇప్పుడది నరకంలో ఉంటుంది— దేవేంద్రా! నన్ను సత్వరం నరకానికి పంపించు!...." అన్నాడాగంతకుడు.

"ఎలా పంపమంటావు మాజీ సత్తమా? గంజాయి వనమ్మున తులసి మొక్క చందంబున సర్వవిధ పాప కార్యంబులకు ఆలవాలమైన వలయం బున నుండియు నీ వెట్టి పాపంబును జేయవైతివి గదా, నరకార్హత బొంద వైతివే!" అన్నాడింద్రుడు.

"త్రాగుడు పాపం కాదా?"

"కానే కాదు, సురాపానం చేయ బట్టియే కదా మేము సురులుగా కీర్తి వహించితిమి!"

సంపాదనం మాంఛి రసపట్టులో నడుస్తున్నది.

"పరాంగనల ఫురానా పొందు అతి గుట్టుగా గడపడం పాపం కాదా?"

"అది జీవసహజ ప్రవృత్తియే కదా, నా బోంట్లు అహల్యాజారత్వ దోషంబున వెయ్యి కన్నాల శాపం పొందినా వెయ్యి కన్నులుగా మార్చుకొని సహస్రాక్షుండనైతిని గదా!"

"బోలెడంత ప్రజాధనాన్ని స్వాహా చేశానని, జాగాలు, భూములు కాజేశానని పత్రికల నిండా కడిగిపారేశారే! అవినీతి పాపం కాదా?"

"అది ప్రయోజకత్వం, కాదెన్నటికీ పాపం! పురుషార్థాల్లో ద్వితీయం. ముని మనుమల వరకు తరగని సంపద గడించింది అ మహాతల్లి మహాలక్ష్మి కటాక్షించబట్టే కదా! నీవు నిమిత్రమాత్రుడవు. అంతియగాక నీ ధర్మ మతి సమర్థవంతముగ నిర్వహించితివి. అలుబిడ్డల కోసమే కదా అందరి తాపత్రయమూను, నీ ఉన్నవాళ్ల పేరునా, లేనివాళ్ల పేరునా భూములు అస్తులు పెట్టి పరోపకారమే జేసి పుణ్యమే మూటగట్టుకొంటివి, నీ స్వార్థమేమియు లేదని నిరూపించుకొంటివి గాదా!"

"మరి పత్రికల్లో అ ఏడుపు—అరణ్యరోదనం ఎందుకు చేశారంటావు?"

"వెర్రివాడా! అయ్యది నక్కద్రాక్షల కథ. అ కడిగేసినవారి కెట్టి అవకాశ లేశంబును రాదు, నీ కట్టి భాగ్యంబు గల్గెనని ఏడ్చినారంతియే! అది యరణ్యరోదనమే కదా!"

"మరేది పాపం??"

"అ చిత్రగుప్తుని చిఠా లో వివి మాత్రమే, అల్పులు, నాస్తికులు—అనగా 'న-అస్తికులు', ఎట్టి అస్తిపాస్తులు లేని పేదలు, పాడు పొట్టకై చేయునట్టివే పాపంబు లనంబడు, నీయట్టి కారణజన్ములు, ఘనులు జేయునవి పాపంబులెంత మాత్రము గావు! అసలు జేయనే జేయరు! వింటివా! సచివా! నా పల్కుల విశ్వసించి సుఖంబుండుము!" అన్నాడింద్రుడు.

"వహ్వా! భగవద్గీతలో కూడా ఇంత సూటిగా చెప్పలేదు, వారెవా! నన్ను ఎంత బాగా సమర్థించావయ్యా ఇంద్రా! భూమ్మీదుండగా నీలాంటోడు పావు మనిషైనా నాకు దొరికితే ఎంత బాగుండి పోను! ........ ఇంద్రా! మాయావీ! పొంగేసి దాచేద్దామనా నీ ఎత్తు! బొరా! టక్కరీ! నీ ఇంద్ర పదవి శాశ్వతమనుకోకు, పది ఫ్లాప్ సిన్మాలు— అవే అవే కళాఖండాలు— నూరు అశ్వమేధాలకు సమానంట! తెల్సా?! వరసగ్గా పది ఫ్లాపులూ తీసేసి ఎవడో ఒకడు నీ ఇంద్రపదవికి ఎసరుపెట్టక మానడు! నువ్వు ఇంద్రత్వంలో ఉండగానే నన్నీ స్వర్గబాధావిముక్తుణ్ణి చేసి పుణ్యం దక్కించుకో!" అన్నా డాగంతకుడు.

ఇంద్రుడు తారెత్తి "ఏమేమీ॥ కొత్త విషయంబు జెప్పితివే! ఆ సంగతేంటో తేల్చుకోవాలి, ఉండుండు...." అంటూ కంగారుగా ఇంద్రుడు లేస్తూంటే అగంతకుడు నవ్వి "అంత దిగులుపడమాక, ఈపాటికి ప్రభుత్వం సిన్మాని ఒక పరిశ్రమగా గుర్తించేసే ఉంటుందిలే! మరి ఫ్లాపుసిన్మాలు రావు. రానివ్వదు. వచ్చినా వాటిని అదీయిదీ చేయించి నాలుగు శృంగార నృత్యాలు చేర్పించి దీవాలా తీయకుండా సొమ్ము చేయింపిస్తారులే!" అన్నాడు.

ఇంద్రుడు కుదుటబడి "అటులనా మిత్రమా!...." అని అంటూంటే అగంతకుడు "అ మాటనకు, నా నౌఖరు మిత్రమా అని పిల్చినా ఫర్వాలేదు గాని నీచేత మిత్రమా అనిపించుకోవడంకంటే నామర్దా లేదు! ఇంతకూ యీ స్వర్గ కారాగార విముక్తి చేస్తావా లేదా?" అన్నాడు గద్దిస్తూ.

"వీల్లేదు!" అన్నా డింద్రుడు గట్టిగా.

"ఎందుకు వీల్లేదు?" మరింత గట్టిగా అడిగాడు అసెంబ్లీలో ప్రతిపక్షిలాగ.

"శాంతించు నాయనా శాంతించు!" అంటూ ఇంద్రుడు స్పీకర్లాగ ప్రారంభించాడు.

"వెనకటికి ఇంద్రద్యుమ్నుడను రాజు పెద్ద కీర్తి వహించి ఇంద్ర లోకంలో జేరె. కొంతకాలంబైన పిదప సురలు అతనితో 'నీ పేరు, భూమిపై మాసె, నిక బొమ్ము' అని సాగనంపనా రాజు నానా తంటాలుపడి ఇంద్రద్యుమ్న సరస్సున దీర్ఘకాలంబు నుండి జీవిస్తున్న ఒక తాబేలు తన్నెరింగియున్న సాక్ష్యంబు దెచ్చుకొని మరల స్వర్గమేతెంచి సురభోగంబుల దక్కించుకొన్న గాథ మహాభారతంబునం గలదు తెలియునా?! అప్పటి నుంచి అది ఒక స్వర్గవాస నిబంధన అయింది! అతిక్రమించ వీలులేదు!_ యమలోకంబున యమగోలగా విప్లవంబు రగిలించినాడట వెనకటి దేవాంతకు డొకడు, వాడిని మించిన అసలు దేవాంతకుడవైన నిన్ను నీ కారుకూతలను సహించలేకపోతున్నా, నువ్విక్కడ్నించి పోతే బాగుణ్ణు అనుకుంటున్నా విధిలేక సహిస్తూన్నాం_ సాగనంప వీలులేదు గనుకనే, నిబంధన నిబంధనయే! అతిక్రమించ వీలులేదు కదా!" అన్నాడింద్రుడు.

"ఆ పుక్కిటి పురాణకథకూ నాకూ ఏమిటి సంబంధం? నువ్వు చెప్పేదేదో సరిగా చెప్పు!" అన్నాడాగంత.

"నీ పేరు భూమ్మీద నిక్షేపంగా నిల్చి ఉంది మాజీ మంత్రిసత్తమా! నిలిచి ఉంది!" అన్నాడింద్రుడు.

"నీ బొంద!.... నా పేరు ఏనాడో నే బతికున్నప్పుడే మాసిపోయింది, అదీగాక గంటకొక ముఖ్యమంత్రి మారిపోతూ వచ్చిన కాలంలో, పాము పడగలెత్తి పార్టీలు బుసలుకొడుతున్న కాలంలో,



ఈపాటికి ప్రళయ ప్రభంజనంలాగ ఉద్దండ మహోద్దండు లెందరో కొత్త పార్టీలు పుట్టించి పనిపట్టించి ఉండవచ్చు. పార్టీల మేలు కలయికలు, పలవలు, చీలికలు, రిజిస్టరు మేరీజీలు, విడాకులు చెలరేగిపోతూండవచ్చు, ఎలక్షన్లు అవాంతరంగా వచ్చిపడుతూండవచ్చు. వాయిదాలపై వాయిదాలు పడుతూ ప్రజల్ని గగ్గోలు చేయమంటూను ఉండొచ్చు— అలాంటి సంరంభయుగంలో మా అమ్మా నాన్నా ఆలోచించకుండా పెట్టిన వెధవపేరు నా పేరు గుర్తుంచుకున్న నరమానవు డుండడం అసంభవం!" అన్నాడాగంత.

"నీవు జెప్పినదియు సత్యమే గాని నీ పేరు పుడమిపై నిలచియే యున్నది. దివ్యదృష్టి నొసంగితి, క్రిందికిం జూడుము" అని ఇంద్రుడు తర్జనితో చూపించాడు.

ఆగంత చూస్తూ "ఆ— ఆఁ.... అయ్యది బురదకోట గ్రామసీమ! ఆడంగులు ఎండిపోయిన నదీ సైకత తలంబుల త్రవ్విన చలాల దగ్గిర పురిసెడు మంచినీటికై ఊటఊరేదాక పడిగాపులు పడుతూ, బిందెలు, కడవలు క్యూ అమర్చియును, తారుమార్లు జేయుచు చలంరేకల కర్రలతో గదాయుద్ధముం జేయుచున్నారు...." అన్నాడు.

"ఆ దెస పరికింపుము!" అన్నాడింద్రుడు.

"పందులు — పందులు, మందలు మందలు! పందులు...." అన్నాడాగంత.

"అపచారమపచారం! పందులు అనకూడదు, విష్ణుదేవుని యవతారంబులు,

వరాహములు అనాలి!" అన్నాడింద్రుడు.

"ఇంద్రా నీదే అపచారం! విష్ణువు ఏదుపంది, అదే కోరకొమ్ములున్న వరాహం— ఆదివరాహం అంటే ఖడ్గమృగం అని కూడా అనుకోవచ్చు— ఆ వరాహావతారం ఎత్తాడు గాని ఊరపంది కాదు! జాగ్రత్త విష్ణువు కీ సంగతి తెల్పిందంటే నీ పని...."అన్నాడాగంత.

"బుద్ధి బుద్ధి!! నాదే పొరపాటు, విష్ణుదేవుడితో జెప్పకుమీ.... పండితా! ఇంకా బాగా చూడు...."

"పెంటకుప్పలు, చెత్తాచెదారం, అబ్బబ్బ!!!" అంటూ ఆగంత ముక్కు మూసుకున్నాడు.

"తత్ చెత్తాచెదార మధ్యంబున నిలచియున్న స్థూపంబును, తత్ స్థూపముఖస్థంబై యున్న శ్వేలశిలాఫలకంబును, తత్ ఫలకంబుపై జెక్కబడిన నీ నామం అంగ్ల సువర్ణాక్షరిం జూచితివా?!" అన్నాడింద్రుడు.

ఆగంత కళ్లు పెద్దవిచేసి చూస్తూ "హా! హతోస్మి! మంచినీటి సప్లయి పథకానికి నా చేతులమీదుగానే శంఖుస్థాపన మహోత్సవం బ్రహ్మాండంగా జరిగింది, అది నా పేరే!........ నీళ్ళ పథకం నీరుకారిపోయినా శంకురాయి దిమ్మ మాత్రం మిగిలి ఉందన్నమాట; ఇలాంటి శంకురాళ్లెన్నో నామరూపాల్లేకుండా నేలగలిసినై కాని ఇదొక్కటి చెక్కుచెదరకుండా మిగిలింది, ఏ లారీ కూడా దీని పని పట్టించలేదా, ఒక్క లారీ— పుణ్యమా అని ఈ శంకుదిమ్మను గుద్దేసి తుదిముట్టించగూడదా! హా!" అంటూ హాహాకారాలు చేస్తూన్న ఆగంత భుజంతట్టి ఇంద్రుడు "లెస్స పల్కితివి! ఆ శంఖుశిల విధ్వంసమగుచో నీ స్వర్గ చెర తొలంగును! అందులకై సర్వ ప్రమాదంబులకును మూలకారణుండైన శనిని ప్రార్థింపుము!" అని ఇంద్రుడు చెప్పాడు.

"ఓ! శనీశ్వరా! కలియుగానికి నీవే నిజమైన దైవగురువు! నీ అనుగ్రహాను గ్రహాలే ప్రపంచాన్ని నడుపుతున్నాయి. ఓం మందాయనమః, ఓం యజాగ్రజాయనమః, గ్రహరాజాయనమః...." అంటూ ఆగంత స్తోత్రం మొదలెట్టాడు. స్తోత్రం హోరుమంటూన్నది. హోరు జోరు హెచ్చిపోతోంది! హటాత్తుగా దూరంలో ఏదో పెద్దశబ్దం! కలకలం! గోల!.... అంతవరకు కంటున్న కల వెండితెరమీద శుభం పలికేసింది. తెలివి వచ్చింది. గోల వినిపిస్తున్నది.

పావన్ ఏదో చెప్పడానికి హడావుడిగా వస్తున్నాడు ఇంట్లోకి.

"ఏవిట్రా ఆ గోల?" అని అడిగాను.

"మరేమరే నాన్నోయ్! శంకురాయి లేదూ, పెద్దలారీ దాన్ని గుద్దేసింది, చిత్తు పప్పయిపోయింది!" అన్నాడు.

"ఏఁ శంకురాయిరా?" అడిగాను.

"అదే అదే— నీళ్ల పంపు లొస్తాయని



వేశారంట, ఆ సిమ్మెంటు దిమ్మ!....” అన్నాడు.

నే నెప్పుడూ ఆ శంకురాయిని పరకాయించి చూడనేలేదు. పంచాయితీవారు కుళాయిలు కావల్సినోళ్లు ఐదొందలు కడ్తే ఏత్తారు!” అని చాటింపు వేయిస్తే చాలామందిమి కట్టాము; అంతే తెలుసు, మూడు నాలుగేళ్లు అయివుంటుంది.

“అయితే— ఆ శంకురాయి కలలో వచ్చిందానో కాదోగాని, అయితే ఆగంతక మహాశయు స్వర్గచెర తీరుతుంది, హమ్మయ్య!” అనుకున్నాను— కాని కల నిజం కాదంటారుగా, అందునా పగటి కల!